క్లుప్తంగా

సీసీ రోడ్డు వేయాలి



సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

నందికొట్కూరు: నాగటూరు గ్రామంలోని 8వ వార్డులో సీసీ రోడ్లు, మురికి కాలువల నిర్మాణం చేపట్టాలని సీపీఎం నాయకులు నాగేశ్వర రావు డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం నాయకులు గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సీసీ రోడ్లు, మురుగు కాలువలు, పింఛన్లు, ఇంటి స్థలాలు, పక్కా గృహాలు కావాలని పలువురు నాయకులకు విన్నవించగా.. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని వారు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గోపాలకృష్ణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



మద్యం బాటిళ్లను చూపుతున్న సీఐ ప్రసాద్‌రావు, సిబ్బంది

శ్రీశైలం: దేవస్థానం టోల్‌గేట్ వద్ద కర్ణాటక మద్యాన్ని పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. వన్‌టౌన్ సీఐ ప్రసాద్‌రావు తెలిపిన వివరాలు.. టోల్‌గేట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా కర్ణాటక రాష్ట్రం బెల్గాం జిల్లాకు చెందిన శివశంకర్ దారెప్ప పాటిల్, గుందేవాడి గ్రామానికి చెందిన ఆనంద్ ముట్వు కాంబ్లేలు మద్యంతో దొరికిపోయారు. 15 బ్యాగ్ పైపర్ విస్కీ బాటిళ్లు, 7 ఆఫీసర్ ఛాయిస్ సుప్రీం విస్కీలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులిద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రక్షణ గోడను పూర్తి చేయండి

నంద్యాల(న్యూటౌన్): దళిత వాడల అభివృద్ధిని కూటమి ప్రభుత్వం విస్మరించిందని, పట్టణంలోని చామకాల్వ, మద్దిలేరు వాగు, కుందూనది రక్షణ గోడను పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగరాజు, సీనియర్ నాయకులు తోటమద్దులు, రాజశేఖర్, సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని బైటిపేట, తెలుగుపేట ప్రాంతాల్లో ప్రజాచైతన్య యాత్రలో భాగంగా మూడవ రోజున పాద యాత్ర నిర్వహించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ బైటిపేట, తెలుగుపేట ప్రాంతాల్లో కాల్వలను శుభ్రం చేయడం లేదన్నారు. దీంతో దుర్వాసనతో వెదజల్లుతుందని, దోమలు ఇళ్లలోకి చేరి రోగాలు వ్యాప్తి చెందుతున్నాయన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నరసింహ, మహమ్మద్‌గౌస్, మౌలాలి, కార్యకర్తలు విజయలక్ష్మి, బాను, తిరుపాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

కళాశాలపై దుష్ప్రచారం తగదు

ఆళ్లగడ్డ: చాగలమర్రి వాసవీ జూనియర్ కళాశాల కేంద్రంగా జరిగిన ఇంటర్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరిగిందని కొందరు దుష్ప్రచారం చేయడం విచారకరమని కళాశాల కరస్పాండెంట్ రమణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మాస్ కాపీయింగ్ జరిగినట్లు, విచారణకు వచ్చిన అధికారులను ప్రలోభాలకు గురిచేసినట్లు సోషల్ మీడియాలో వస్తోందని దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఇదంతా తమ కళాశాలకు మాత్రమే పరీక్ష కేంద్రం అనుమతి ఇచ్చారన్న అసూయతో గిట్టనివారు చేస్తున్న ఆరోపణలు అని పేర్కొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు నమ్మవద్దని కోరారు.

మూల పెద్దమ్మకు విశేష పూజలు



దొర్నిపాడు: మండలంలోని డబ్బ్యాగోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు చేసి పట్టు వస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు. అనంతరం భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. ఆలయ కమిటీ సభ్యులు తలారి శ్రీనివాసులు, మిద్దె శంకరయ్య, చిన్నన్న, చిన్నపెద్దన్న ఏర్పాట్లు చేశారు.

తహసీల్దార్ కార్యాలయానికి భవనం

దొర్నిపాడు: ఆరేళ్లుగా తహసీల్దార్ కార్యాలయం లేక ఇబ్బందులు పడ్డ అధికారులు వేరే భవనంలోకి వెళ్తున్నారు. ఇన్నాళ్లు మండల పరిషత్ కార్యాలయంలో మూడు గదులను తీసుకుని ప్రజలకు సేవలు అందించారు. చాలీచాలని గదుల్లో అనేక అగచాట్లు పడాల్సి వచ్చింది. సిబ్బంది కూడా సరైన వసతులు లేక చెట్ల కింద కూర్చొని కాలం వెల్లదీశారు. ప్రస్తుతం స్థానిక బాలికల వసతి గృహాన్ని ఆళ్లగడ్డకు మార్చడంతో ఖాళీగా ఉన్న భవనానికి నూతన రంగులు, విద్యుత్, నీటిని వసతి ఏర్పాటు చేసుకుని తహసీల్దార్ కార్యాలయంగా తీర్చిదిద్దారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయం వీడి నూతన భవనంలోని మారేందుకు తహసీల్దార్ సుభద్ర అన్నీ ఏర్పాట్లు చేయించారు.

- ఉపాధి కూలీలకు అందని వేతనాలు
- జీవన భృతి కోల్పోతున్నామంటూ వేతనదారుల ఆవేదన
- మూడువారాలకు రూ.1.36 కోట్ల వేతన బకాయి

పనులు చేసినా.. పస్తులేనా!



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

కొత్తపల్లి: ఉపాధి కూలీలు పనులు చేసినా పస్తులుండే పరిస్థితి దాపురించింది. కొంతకాలంగా ప్రభుత్వం వేతనాలు పెండింగ్‌లో పెట్టడంతో కూలీల పూట గడవని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి బకాయిలు ఇవ్వాలని పలువురు కూలీలు కోరుతున్నారు. ప్రభుత్వం వలసలు నివారించేందుకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా అధికారులతో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి పనులు కల్పించింది. కూలీలు సుమారు 90 రోజుల పనులు పూర్తి చేసుకున్నా వేతనాలు ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. నెలల తరబడి పనులు చేయించుకొని వేతనాలు ఇవ్వకపోవడంతో తమ జీవనం గడిచేదెల్లా అంటూ ప్రశ్నిస్తున్నారు. అధికారులను ఎన్నిసార్లు అడిగిన నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారని వేతనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

రూ.కోట్లలో బకాయిలు

కొత్తపల్లి మండలంలో 7,300 జాబుకార్డులు ఉన్నాయి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా జనవరి నుంచి ఫిబ్రవరి నెల దాకా 8 వారాలకు గాను వారానికి 2,820 మంది చొప్పున 22,560 మంది అంటే 5 వేల కుటుంబాలు పనులు చేశారు. వీరికి సుమారు రూ.కోటి దాకా రావాల్సి ఉంది. వేసవి ప్రారంభం కావడంతో ఫిబ్రవరి నుంచి మార్చి నెలలో పనులకు అధిక సంఖ్యలో వేతనదారులు హాజరు అవుతున్నారు. అయితే ఇప్పటికి 3 వారాలకు గాను రోజుకు 3 వేల మంది దాకా వేతనదారుల చొప్పున వారానికి 18వేల మంది లెక్కన మూడు వారాలకు కలిపి సుమారు రూ.1,36,08,000 వేతన బకాయిలు రావాల్సి ఉంది. దీంతో మొత్తం 11 వారాలకు గాను మండలంలో సుమారు రూ.2,36,08,000 బకాయిలు రావాల్సి ఉంది. ఈ వేతన నగదు ఎప్పుడు వస్తుందా అని కూలీలు ఎదురుచూస్తున్నారు.

పస్తులుండాలా?



10 వారాల నుంచి పనులు చేస్తున్నాం. ఇంతవరకు ఒక్క పైసా కూడా నా ఖాతాలో జమ కాలేదు. వేరే పనులకు కూడా వెళ్లడంలేదు. జీవనం ఎలా గడుస్తుంది. పనులు చేసి పస్తులుండే పరిస్థితి వచ్చింది. వేతనాలు రాకపోతే ఊరి వదిలి వలస వెళ్తాం.

– జయన్న, ఎర్రమఠం గ్రామం వేతనదారుడు

కూలీ డబ్బులివ్వాలి



ఈ ఏడాది పనులు మొదలైనప్పటి నుంచి పనులు చేస్తూనే ఉన్నాం. 11 వారాలకు గాను కనీసం 5 వారాల వేతనాలు కూడా మాకు రాలేదు. అధికారులు స్పందించి డబ్బు మంజూరు అయ్యేలా చూడాలి. లేకపోతే మళ్లీ వలస వెళ్లక తప్పదు.

– రామదాసు, గువ్వలకుంట్ల గ్రామ వేతనదారుడు

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

పాములపాడు: స్థానిక తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సుభద్రమ్మ, ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కరించుకోవాలని వారు సూచించారు. కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

సమస్యాత్మక గ్రామాలపై దృష్టి సారించండి

● ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్

మిడుతూరు: మండలంలోని సమస్యాత్మక గ్రామాలపై దృష్టి సారించాలని ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ సిబ్బందికి సూచించారు. ఆదివారం మండల పరిధిలోని నాగలూటి గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. గ్రామంలో అందరూ కలసి, మెలసి ప్రశాంతంగా జీవనం గడపాన్నారు. నాటుసారా, పేకాట తదితర అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ ఓబులేసు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములును ఆదర్శంగా తీసుకోవాలి



పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఆర్యవైశ్య సంఘం నాయకులు



పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న మర్చెంట్స్ అసోసియేషన్ నాయకులు

నందికొట్కూరు: అమరజీవి పొట్టి శ్రీరాములు జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ సూచించారు. అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆదివారం పట్టణంలోని ఆయన విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సత్యనారాయణ మాట్లాడుతూ తెలుగు వారందరూ కలిసి ఉండాలని ఉద్దేశంతో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి తనువు చాలించారన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు కృష్ణమూర్తి, నాగప్రసాద్, బచ్చు శ్రీను, నాగరాజు, కృష్ణమూర్తి, కల్కి శ్రీను, గురుమూర్తి, పార్థసారథి, రాజేష్, శేషఫణి, రామాంజనేయులు పాల్గొన్నారు.

మర్చెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ..

శ్రీశైలంప్రాజెక్ట్: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీశైలంప్రాజెక్ట్‌లో ఘనంగా నిర్వహించారు. శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి అసోసియేషన్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు కొత్త వెంకటేశ్వరరావు, చల్లా కిశోర్, ఇమ్మడిశెట్టి సత్యనారాయణ, డీవీ నారాయణ, ఈశ్వరయ్య, ఉమ్మిడిశెట్టి హనుమంతరావు, వేముల శ్రీను, జూటూరి వాసు తదితరులు పాల్గొన్నారు.

● వెలుగోడు: అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిదని ఆర్యవైశ్య నాయకులు తాళ్లూరి రవి కుమార్ అన్నారు. ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా పొట్టి శ్రీరాములు సెంటర్లోని ఆయన విగ్రహానికి ఆర్యవైశ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు సురేష్ బాబు, రవికుమార్, సంపత్, బాలకృష్ణ, మల్లికార్జున, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీరంగనాథస్వాములకు ప్రత్యేక పూజలు



దేదీప్యమానంగా భక్తులకు దర్శనమిస్తున్న శ్రీలక్ష్మీరంగనాథస్వామి

జూపాడుబంగ్లా: మండలంలో తర్తూరు లక్ష్మీ, రంగనాథస్వామి వార్లకు ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకాలు నిర్వహించి, పట్టువస్త్రాలతో దేదీప్యమానంగా అలంకరించారు. అనంతరం పుష్పార్చన, కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించారు. తాటిపాడు, జూపాడుబంగ్లా, తరిగోపుల, పారుమంచాల, తంగడంచ, మండ్లెం, తర్తూరు తదితర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్లకు కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఏప్రిల్ 6 నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాలు

ఏప్రిల్ 6 నుంచి 15వ తేదీ వరకు తర్తూరు లక్ష్మీరంగనాథస్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ వెంకటరమణ తెలిపారు. 13న స్వామివారి రథోత్సవం ఉంటుందన్నారు.

ఉత్సవ కమిటీ నియామకం

తర్తూరు జాతర ఉత్సవ కమిటీని నియమిస్తూ దేవదాయశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు. చైర్మన్‌గా తరిగోపుల నారాయణరెడ్డి, సభ్యులుగా తంగడంచ ఏ.ప్రభావతమ్మ, తర్తూరు లక్ష్మిదేవి, తరిగోపుల పరమేశ్వరయ్య, తర్తూరు కె.వెంకటేశ్వర్లు, తాటిపాడు వెంకటేశ్వరమ్మ, జూపాడుబంగ్లా డి.సుబ్బన్నలను నియమించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గిత్త జయసూర్య, ఈఓ వెంకటరమణ పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీదేవత

గుండ్లకమ్మ వాగులో పూడిక తీయాలి



గుండ్లకమ్మ వాగును పరిశీలిస్తున్న నాయకులు

ఆత్మకూరు: గుండ్లకమ్మ వాగులో పూడిక తీసి సమీప కాలనీల ప్రజలను వరదల నుంచి కాపాడాలని సీపీఎం నాయకులు ఎ.రణధీర్, ఎ.సురేంద్రలు అధికారులను కోరారు. ప్రజాచైతన్య యాత్రలో భాగంగా ఆదివారం పట్టణంలోని గరీబ్ నగర్ 19వ వార్డులో సీపీఎం నాయకులు పర్యటించారు. స్థానికుల ద్వారా సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గుండ్లకమ్మ వాగు వెంట పలు కాలనీల్లో ప్రజలు ఏళ్ల నుంచి జీవనం సాగిస్తున్నారన్నారు. వాగులో పూడికతీకపోవడంలో వర్షా కాలంలో చిన్నపాటి వర్షాలకు కూడా వాగు నుండి కాలనీలలోకి చేరుతుందన్నారు. అధికారులు స్పందించి పూడిక తీయించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు డి.రామ్‌నాయక్, వీరన్న, భాస్కర్, ఎ.సువర్ణమ్మ, కిరణ్, శాలు, నబీ పాల్గొన్నారు.

బీటీ రోడ్ల మరమ్మతులకు ప్రతిపాదనలు

కొత్తపల్లి: మండలంలోని ఆయా గ్రామాలకు ఉన్న బీటీ రోడ్లకు మరమ్మతులు చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపామని నందికొట్కూరు పీఐయూ(ప్రాజెక్ట్ ఇంప్లీమెంటేషన్ యూనిట్)డీఈ రామ్మోహన్ ఆదివారం తెలిపారు. మండలంలోని కొక్కెరంచ గ్రామం నుంచి దుద్యాల మీదు ఆత్మకూరు పట్టాణానికి వెళ్లే బీటి రహదారి పునర్నిర్మాణం కోసం నాబార్డు నిధులు రూ.1.80 కోట్లు మంజూరు అయ్యాయని త్వరలో పనులు ప్రారంభిస్తామని చెప్పారు. అదేవిధంగా దుద్యాల నుంచి నందికుంట గ్రామానికి రూ.10 లక్షలు, శివపురం నుంచి శివపురం గూడెం వరకు రూ.15 లక్షలు, గువ్వలకుంట్ల నుంచి బీఎస్ పాలెం వరకు రూ.5లక్షలు, సంగమేశ్వరం ప్రధాన రహదారి నుంచి సింగరాజు పల్లె గ్రామంలోకి బీటీ రహదారికి రూ.4.50లక్షలతో ప్రతిపాదనలు పంపామని వెల్లడించారు. వీటితోపాటు సింగరాజు పల్లె గ్రామ సమీపంలో సంగమేశ్వరం ప్రధాన రహదారి నుంచి బట్టువారి పల్లె గ్రామానికి రూ.4 లక్షలు, మెయిన్ రోడ్డు నుంచి ముసలిమడుగు గ్రామంలోకి రూ.5 లక్షలు, కొత్తమాడుగుల నుంచి నాగంపల్లి గ్రామం వరకు రూ.5లక్షల వ్యవయంతో బీటీ రోడ్లను మరమ్మతులు చేపట్టేందుకు ప్రతిపాదనలు జిల్లా అధికారులకు పంపామని, నిధులు మంజూరైన వెంటే పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

గిరిజనులకు భూమి ఇవ్వాలి



గిరిజనులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు: అమలాపురం గిరిజన గూడెంలో 25 ఏళ్లుగా జీవనం సాగిస్తున్న 42 కుటుంబాలకు భూములు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.యేసురత్నం, ఎం.నరసింహానాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా అమలాపురం గిరిజన గూడెంలో వారు పర్యటించారు. గూడెంలోని గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మినీ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, ఉపాధి హామీ పథకం పనులు కల్పించి, జాబ్‌కార్డుకు ఆధార్‌కార్డు అప్‌డేట్ చేయాలని, కొత్త జాబ్‌కార్డులు ఇవ్వాలని, పక్కా గృహాలను ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలని, ఉగాది సందర్భంగా అంగళ్ల ఏర్పాటు చేసుకోవడానికి శ్రీశైలం ఐటీడీఏ తరపున ఆర్థిక సాయం చేయాలని పలువురు గిరిజనులు నాయకులతో విన్నవించారు. డిమాండ్లను అధికారుల దృష్టికి తీసుకెళ్తామని నాయకులు గిరిజనులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యుడు మల్లికార్జున, నాయకులు వెంకటమ్మ, మూగమ్మ, వెంకటేశ్వర్లు, నాగన్న, పెద్దన్న, గురువయ్య, మూగన్న పాల్గొన్నారు.

డీలర్లపై చర్యలు తీసుకోవాలి



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

పగిడ్యాల: అక్రమాలకు పాల్పడుతున్న ప్రభుత్వ చౌక ధరల దుకాణ డీలర్లపై చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కన్వీనర్ పక్కీర్‌సాహెబ్ డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా ఆదివారం నెహ్రూనగర్‌లో పర్యటించి, ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. రెండు నెలల నుంచి డీలర్లు నిత్యవసర సరుకులు సక్రమంగా పంపిణీ చేయడం లేదని వినియోగదారులు నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పడమర ప్రాతకోట 21వ రేషన్ దుకాణదారుడు ఫిబ్రవరి నెల బియ్యం పంపిణీ చేయకుండా 80 బస్తాలు మాయం చేసినా అధికారులు చర్యలు తీసుకోకపోవడం తగదన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఈశ్వరమ్మ, లక్ష్మన్న, వెంకట్రాముడు, నాగేష్, మధు, మద్దిలేటి, శాంతన్న, బాబు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సున్నిపెంటలో సీపీఎం నాయకుల పర్యటన

శ్రీశైలంప్రాజెక్ట్: ప్రజాచైతన్య యాత్రలో భాగంగా ఆదివారం సీపీఎం నాయకులు సున్నిపెంటలోని మేదరి బజార్, ప్రభుత్వ ఆసుపత్రి, ఆర్టీసీ బస్టాండ్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఆయా కాలనీల్లో నెలకొన్న సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎం.మల్లికార్జున, మునిపాటి.చిన్న మారెన్న, దర్శనం.నాగరాజు, రజాక్‌బాషా, సలీంబాషా, దస్తగిరి, నాగూర్‌బీ, మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి

పాములపాడు: ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తనతో మెలగాలని ఎస్ఐ సురేష్‌బాబు సూచించారు. ఆదివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరితో కలిసి మెలిసి ఉండాలని, అల్లర్లకు, గొడవలకు దూరంగా ఉండాలని చెప్పారు. పిల్లలను మంచిగా చదివించుకోవాలన్నారు. ఏ విషయంలోనైనా కేసుల్లో ఇరుక్కుంటే తీవ్ర ఇబ్బందులు పడతారని హెచ్చరించారు. అనంతరం అందరిచే సంతకాలు చేయించుకొని పంపించారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

పాములపాడు: మండలంలోని గుండాల నట్టు గ్రామంలో ఈతకు వెళ్లి మృతి చెందిన విద్యార్థి అమూల్యరాజ్ కుటుంబ సభ్యులకు మాజీ సర్పంచ్ టేకురి రామసుబ్బమ్మ ఆర్థిక సాయం అందజేశారు. ఆదివారం మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సింగపూర్ తెలుగు సమాజం కార్యదర్శి టేకూరు నాగేశ్వరరావు విషయం తెలుసుకొని తన తల్లి, మాజీ సర్పంచ్ ద్వారా రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

కొత్తపల్లి: ప్రజల సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీపీఎం మండల కార్యదర్శి ఎస్ స్వాములు, నాయకులు సంజీవరాయుడు, సింగరాజుపల్లి, కార్యదర్శి దాసు విమర్శించారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా ఆదివారం వారు సింగరాజు పల్లి గ్రామంలో పర్యటించి ప్రజలు సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఏసన్న, దేవకుమార్, పి శేఖర్, ఇమ్మానియేల్ పాల్గొన్నారు

మద్యం, నాటుసారా స్వాధీనం

ఆత్మకూరు: పట్టణంలోని ఇద్దరు మహిళల నుంచి నాటుసారా, మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రాము తెలిపారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో బెల్టుషాపులు, నాటుసారా స్థావరాలపై ఆదివారం పోలీసులు దాడులు చేశారు. వడ్ల రామాపురం రస్తాలోని ఏబీఎం పాలెంకు చెందిన పీట్ల శ్రీదేవి వద్ద నుంచి 12 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పరిచారు. వడ్డే శివలక్ష్మి వద్ద నుంచి ఐదు లీటర్లు నాటుసారాను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మహానందిలో వీకెండ్ సందడి

మహానంది: మహానందిలో శనివారం వీకెండ్ సందడి నెలకొంది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు ఆలయానికి వచ్చారు. భక్తులు స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. ఉదయం, మధ్యాహ్నం స్వామి, అమ్మవార్లకు అష్టవిధ మహామంగళ హారతులు చేపట్టారు.

‘పది’ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

పాములపాడు/నందికొట్కూరు/ఆత్మకూరు/బండి ఆత్మకూరు/మహానంది: పదో తరగతి పరీక్షలకు విద్యాశాఖ అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. సోమవారం నుంచి పరీక్షలు ప్రారంభం కానుండటంతో ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పాములపాడు, నందికొట్కూరు, ఆత్మకూరు, బండి ఆత్మకూరు, మహానంది మండలాల విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఆదివారం వారు వేర్వేరుగా మాట్లాడారు. పాములపాడు మండలం నుంచి 430 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనుండటంతో ఏఎస్ఆర్ జెడ్పీహెచ్ స్కూల్, ఏపీ మోడల్ స్కూల్‌లో కేంద్రాలు ఏర్పాటు చేశామని ఎంఈఓ బాలాజీనాయక్ తెలిపారు.

➤ ఆత్మకూరు మండలంలో 1,500 మంది రెగ్యులర్ విద్యార్థులు, 271 మంది ఓపెన్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని, వీరికి ఆత్మకూరులో ఏడు సెంటర్లు ఏర్పాటు చేసినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

➤ బండిఆత్మకూరు మండలం వ్యాప్తంగా 580 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు ఎంఈఓ యశోద తెలిపారు.

➤ మహానంది మండలంలో 470 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానుండటంతో మూడు కేంద్రాలను ఏర్పాట్లు చేశారు.

➤ పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య జిల్లా కార్యదర్శి దక్క కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన నందికొట్కూరులో మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల వద్ద బుక్ షాపులు, జిరాక్స్ కేద్రాలను అధికారులు మూసివేయించాలని కోరారు.

➤ ఈనెల 31న రంజాన్ పండుగ రోజు కూడా పదో తరగతి పరీక్ష(సోషల్) ఉండటంతో ముస్లిం విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం

● ఘనంగా ముగిసిన ఆహోబిలేశుని ఉత్సవాలు



గరుత్మంతుడిపై ప్రహ్లాదవరదుడు



ఉత్సవమూర్తులకు తిరుమంజనం

ఆళ్లగడ్డ: అహోబిలేశుడి బ్రహ్మోత్సవాలు ఆదివారం పరిసమాప్తం అయ్యాయి. చివరి ఘట్టమైన ధ్వజావరోహణం ఆదివారం తెల్లవారుజామున ఆగమోక్తంగా జరిగింది. ఉత్సవాల మొదటి రోజు ధ్వజారోహణ సందర్భంగా సకల దేవతలను ఆహ్వానించిన గరుడాళ్వార్ తిరిగి పంపే కార్యక్రమం శాస్త్రకంగా జరిగింది. ఉత్సవమూర్తులు స్వామి, అమ్మవార్లను పంచామృతాలతో అభిషేకించి, తిరుమంజన సేవ గావించిన అనంతరం ఆలయ ధ్వజస్తంభం వద్దకు వేంచేశాక ముద్రక్త ఆఘమశాస్త్రం ప్రకారం వేదమంత్రోచ్చరణలతో ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ధ్వజస్తంభంపై ఉన్న గరుడ పటాన్ని శాస్త్రోక్తంగా కిందకు దించారు. అనంతరం ముద్రకర్త కీడాంబి వేణుగోపాలన్ ఆధ్వర్యంలో అర్చకులు గరుడధ్యానం, భేరీపూజ, గరుడ గద్యం, దిక్పాలక గద్యం, గరుడ లగ్నాష్టకం, గరుడ చూర్ణిక మంత్రాలను జపించి బ్రహ్మోత్సవాలు ముగిసినట్లు వేదపారాయణం ద్వారా ప్రకటించారు.

ప్రశాంతం... బ్రహ్మోత్సవం

అహోబిలం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ నెల 3వ తేదీ మొదలైన ఉత్సవాలకు మొదట్లో భక్తులు పెద్దగా కనిపించకపోవడంతో చివరి ఘట్టాలైన రథోత్సవం, కల్యాణోత్సవం, గరుడ సేవకు భారీగా వస్తారని అంచనా వేసినా మాడవీధుల్లో భక్తులు కనిపించారే తప్ప కిక్కిరిసిపోలేదు. ఆయల అధికారులు సామాన్య భక్తులకు అవసరమైన ఏర్పాట్లు, వసతులు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారనే ఆరోపణలు వినిపించాయి. పోలీసులు వీఐపీల దర్శనం కోసం అడుగడునా సామాన్య భక్తులను ఇబ్బందులకు గురిచేశారన్న విమర్శలు మెండుగా వినిపించాయి. కల్యాణం రోజు భక్తులను ఎవరినీ లోపలకు పంపకుండా కేవలం వీఐపీలను మాత్రమే కూర్చోబెట్టి సామన్య భక్తులను అందరినీ ఎల్ఈడీ టీవీల్లో చూడాలని ఆదేశించడంపై భక్తులు మండిపడ్డారు. ఈ ఎల్ఈడీ టీవీల ముందు కూర్చోవడానికి ఇంత దూరం రావాలా.. ఇంట్లో కూడా కూర్చుని చూడొచ్చు కదా అని అసహనం వ్యక్తం చేశారు.



పీఠాధిపతికి బ్రహ్మోత్సవ మర్యాద చేస్తున్న అర్చకులు



గుడిలోకి వెళ్లలేక బయటే దర్శనం చేసుకుంటున్న దివ్యాంగులు

దివ్యాంగులు, వయో వృద్ధులకు తప్పని ఇక్కట్లు

ఆలయ నిర్వాహకులు ఎంత సేపు వీఐపీలు, వీవీఐపీల దర్శనానికే ప్రముఖ్యత ఇచ్చారు తప్ప దివ్యాంగులు, వయోవృద్ధులు, చంటిపిల్లల తల్లుల దర్శనం గురించి ఏ మాత్రం పట్టించుకోలేదు. వీరు స్వామిని దర్శించుకునేందుకు కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో అనేక మంది తొక్కిసలాటలో స్వామిని దర్శించుకోలేక ఉసూరుమంటూ గుడి బయట నుంచే ముక్కులు చెల్లించుకుని వెనుదిరగాల్సిన దుస్థితి నెలకొంది.